# అనుమానం

★

దీపాలు పెట్టారు. 6 గం॥ లు అయినవి. "ఇంకా మధు రాలేదేమిచెప్మా! ఈరోజు సినిమాకు తీసుకు వెళతానని చెప్పి-ఇంత వరకు రాకపోవుటకు కారణము ఏమిటి! కాలేజి 5 గం॥ లకే విడుస్తారే?" అని జ్యోతి తన తమ్ముడయిన మధునిగురించి ఆలోచిస్తూ గదిలోకూర్చుని వుంటుంది. "ఏమిటి అక్కయ్యా అలాగున ఆలోచిస్తున్నావు? నాకోసమేనా?" అంటూ మధు లోపలకు ప్రవేసిస్తాడు.

"ఇలాగుచూడు అక్కయ్యా! నామీద కోపము వచ్చిందా? ఈరోజు ప్రాక్టికల్ వుండుటచేత ఆలస్యమైనది; క్షమించు అక్కయ్యా!"

"క్షమించుటకు నేను ఎవరు మధు!"

"అలాగున అనకు అక్కయ్యా! నీతరువాతనే నాకు ఎవరయినా."

మద్రాసులో మధు B. Sc చదువుచున్నాడు. జ్యోతి, మధు, పినతండ్రి పెదతండ్రి బిడ్డలు. జ్యోతి తండ్రి ప్రసాదరావుగారు మద్రాసులో వకీలు. ప్రసాదరావుగార్కి జ్యోతి ఒకర్తె కూతురు; జ్యోతి తల్లి అయిన లక్ష్మీదేవిగారు పూర్వాచార పరాయణురాలు అగుటచేత జ్యోతికి 12 సం॥ పెండ్లి చేశారు. కాని జ్యోతి 13 సం॥ భర్తపోయిన అభాగ్యురాలైనది. జ్యోతి అందాల భరణి. మంచిహృదయముగల వ్యక్తి; ఎవరు కష్టపడినా చూడలేనటువంటి జాలిగల నిర్మలజీవి. మధు తండ్రి ప్రకాశరావుగార్కి పిఠాపురం దివాణంలో 200 రూ॥ జీతము. జ్యోతికి మధు అంటే ఎంతో ప్రేమ, మధుకి జ్యోతి అంటే ఎంతో ప్రేమ. ఆమెజీవితము ఆలాగున అయినదని మధు మనస్సు ఎప్పుడు జాలిగాను, కష్టముగాను వుండేది. సోదరి జ్యోతి మనస్సు ఎప్పుడు కష్టపెట్టేవాడు కాడు. జ్యోతి ఏపని చెప్పినప్పటికి, తనకు ఎన్ని పనులున్నామాని, ముందర జ్యోతి పనిచేసేవాడు.


రచన:

శ్రీమతి బి. సరోజినీదేవిగారు


"అమ్మా. జ్యోతీ, అన్నానికి రాతల్లీ?"

"మధు కూడ రానీయవే, వాడూ నేనుతింటాము."

"వాడికోసము నీవు కూర్చోడ మెందుకే? అయినా ఇలారా; నీకు ఒకమాట చెప్పాలి."

"ఏమిటే అమ్మా?"

లక్ష్మి-:జ్యోతీ, నీకు ఒకసంగతి చెపుతాను, నీవు ఏమి అనుకోకు తల్లీ!

జ్యోతి:-ఏమిటే చెప్పు; నేను ఏమియు అనుకోను.

ల:-చూడుతల్లీ నీవు మధుతోటి షికార్లు, సినిమాలకు వెళ్లుట బాగుండదు. అయినా వాడితోటి అంత ఎక్కువగా మాట్లాడ వద్దు. ఎవరయినా చూస్తేబాగుండదు. అందుచేత నీవురేపటినుంచి వాడితోటి ఎక్కడికి వెళ్లకు,,

జ్యో:-అదేమిటమ్మా! అలాగున అంటున్నావు? తమ్ముడితోటి కూడ మాట్లాడుట తప్పేనా? అయితే నాజీవితము అంతపాడయినదా? ప్రపంచకము అంతదుర్మార్గముగా ప్రవర్తిస్తున్నదా? అక్క, తమ్ముడి మీదేనా అనుమానము? ఈసంఘంలో నాబోటి స్త్రీలు ఎవరితోటి మాట్లాడినా తప్పేనా? తమ్మునకు నేను అంటే ఎంతోదయ; ఎలాగున మాట్లాడుట మానమన్నావు అమ్మా!

ల:-అమ్మా! నేను తప్పనోసము చెప్పటలేదు. నీకయిన 18 సం॥ వచ్చినాయి. నీకన్న 6 నెలలే కదా మధు చిన్నవాడు. నీకుమాత్రము మంచి చెడ్డలు తెలియవా? వాడితల్లి, అక్కలకు, నీవుచెప్పే మాటలు అన్నీవాడు వింటూయున్నాడని, వాళ్లకు అనుమానం. నీతోటి వాడుమాట్లాడుట ఎంతమాత్రము వాళ్లకు ఇష్టములేదు.

జ్యో:-పోనీ అమ్మా! వాళ్లమాటలు వాళ్లకే వుంటాయి.

ల:-పిచ్చితల్లి! నీవు మొన్న డిసెంబరు శెలవులకు పిఠాపురం వెళ్లినప్పుడు ఎన్నిమాటలన్నారు. నీవు వాడు, కలసి సినీమాలకు, షికార్లు, వెళతారని, ఒకచోటే కూర్చొనే వాళ్లని, నేను చెప్పరదగ నటువంటి మాటలు అన్నారు.

జ్యో:-పోనీవే! మాట్లాడుట మానివేస్తాను.

అని జ్యోతి తన గదిలోనికి వెళ్లిపోయి ఆలోచనలో పడింది. 'ఛీ! పాడు ప్రపంచకము. నాబోటి అనాథస్త్రీ సోదరునితో మాట్లాడి నంత మాత్రాన్నితప్పా? భర్తవున్న స్త్రీ ఎటువంటి తప్పచేసినా తప్పలేదు? భర్తలేని స్త్రీ ఆశరాని తోటి మాట్లాడినా తప్పేగదా? నేను బ్రతికి వుండేకన్న ఈప్రాణాలు వదులుతే నయం' ఈమాట అనుకొనేసరికి జ్యోతి కళ్లంట నీళ్లు గిర్రున తిరిగాయి. ఇంతటిలోకి మధుయొక్క జోడు చప్పుడు వినేసరికి కళ్లంట నీరు గబ, గబ, తుడుచు కొనేసుకుంది. "అక్కయ్యా ఏమిచేస్తున్నావు" అంటూ జ్యోతి ముఖము చూడగానే. "అదేమిటి అక్కయ్యా ఏడుస్తున్నావు! నాతోచెప్పవు? నేను నీతమ్ముడిని గాను?" అంటూ జ్యోతియొక్క కళ్లనీళ్లు తుడుస్తూవుంటే మధుకి కూడా కళ్లనీళ్లు వచ్చాయి. "ఛీ! అదేమిటి మధు, నీవు ఏడుస్తున్నావు వూరుకో?"

"ఎందుకు ఏడుస్తున్నావు నాతోటి చెప్పవు అక్కయ్యా?"

"ఏమిలేదు మధు,నీవు నన్ను ఆపేక్షతో చూస్తునందులకు ఈప్రపంచకము ఓర్వలేకుండగా యున్నది. నానోటంట నేను అనకూడదుగాని లోకం మనమీద అనేకవిధాల అనుమానం పడుతోంది, ఇంకేమి చెప్ప మంటావు మధు!"

"ఓస్, ఇంతేనా! ఇంకా ఏమిటో అనుకొన్నాను, నీవునిజంగా పిచ్చి అక్కయ్యవు. ప్రపంచకము ఏమి అనుకుంటేనీకేం. మన సోదర ప్రేమ మన మనస్సులకు తెలుసు, మనము పవిత్రమైన మనస్సులతో ప్రవర్తిస్తున్నాము. జనులు ఎటువీలుగావుంటే అటుమాట్లాడుతారు. నీవు పిచ్చి పిచ్చి అనుమానములు పెట్టుకొని మనస్సు పాడుచేసుకోకు. ఎవరెన్ని అనుమానములు పడినా నీవు, నేను, బ్రతికి వున్నంత వరకు మన సోదర ప్రేమ ఇలాగుననే వుంటుంది. పైన భగవంతుడు సాక్షి, నీకునీమనస్సు, నాకు నామనస్సుసాక్షి. ప్రజల అనుమానములకు భయపడకు. లే! సినీమాకు ఇవాళ వెళదాము. ఇవాళ పరదేశి సినీమా; అందులో వాళ్లసోదర ప్రేమ చూద్దాము."